AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM

4-11-2026 (Wednesday)

MAIN EDITION

భారత్ ఘన విజయం



అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్: న్యూజిలాండ్ తో జరిగిన తొలి వన్డేలో భారత్ ఘన విజయం సాధించింది. విరాట్ కోహ్లి 74 పరుగులతో రాణించాడు. మొదట బ్యాటింగ్ చేసిన కివీస్ జట్టు 185 పరుగులకే ఆలౌట్ అయింది. లక్ష్య ఛేదనలో రోహిత్ శర్మ డకౌట్ కాగా.. కోహ్లి, గిల్ ధీటుగా ఆడారు. అయితే రెండు సార్లు వర్షం పడటంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో భారత లక్ష్యాన్ని 32 ఓవర్ల లో 143 పరుగులకు తగ్గించారు. భారత్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

పంజాబ్‌లో డ్రగ్స్ ముప్పు : రాహుల్ గాంధీ



అక్షరటుడే, పంజాబ్: పంజాబ్‌లో డ్రగ్స్ వాడకం పెరిగి యువత జీవితాలు నాశనం చేసుకుంటున్నారని రాహుల్‌గాంధీ అన్నారు. సంగ్రూర్‌లో జరిగిన 'ఇన్సాఫ్ ర్యాలీ'లో ఆయన మాట్లాడారు. ఆమ్ ఆద్మీ పార్టీ డ్రగ్స్‌ను నిర్మూలించడంతో విఫలమైందని విమర్శించారు. ఈ రాష్ట్రానికి పరిశ్రమలు, కర్మాగారాలు, అభివృద్ధి చెందుతున్న వ్యవసాయ రంగం అవసరం అన్నారు.

చంద్రబాబుకు ప్రధాని ఫోన్



అక్షరటుడే, ఏపీ : ఏపీ సీఎం చంద్రబాబుకు ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్ చేశారు. అర్మేబ్, మురసు తుపాన్‌ల ప్రభావంపై ఆరా తీశారు. తుపాన్ల ప్రభావిత పరిస్థితిని తెలుసుకున్నారు. భారీ వర్షా లతో వాటిల్లిన నష్టంపై సీఎం చంద్రబాబు ప్రధానికి వివరించారు. రాష్ట్రానికి సాయం అందించాలని కోరారు.

ఈడీ విచారణకు అంబటి రాంబాబు



అక్షరటుడే, హైదరాబాద్ : హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో విచారణకు మాజీ మంత్రి అంబటి రాంబాబు హాజరయ్యారు. మద్యం రవాణా కుంభకోణంలో మనీలాండరింగ్ వ్యవహారంపై అంబటిని ఈడీ అధికారులు ప్రశ్నించారు. ఈ కేసులో ఇప్పటికే పలువురిని అరెస్ట్ చేశారు.


ఎర్లీ మార్నింగ్ షోలకు అనుమతి



అక్షరటుడే, సినిమా డెస్క్: తమిళనాడులో సినిమా థియేటర్ల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. గత మూడేళ్లుగా నిలిపివేసిన తెల్లవారుజామున 6 గంటల షోలకు మళ్లీ అనుమతి ఇస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే టికెట్ ధరల పెంపు ప్రతిపాదనను మాత్రం తోసిపుచ్చింది.

అగ్నివీర్‌ల పదవీ కాలం పొడిగింపు

అక్షరటుడే, ఢిల్లీ: అగ్నివీర్‌ల పదవీ కాలాన్ని మరో రెండేళ్లు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ ఎన్.ఎస్. రాజా సుబ్రమణి వివరాలు వెల్లడించారు. తమ తొలి నాలుగేళ్ల నియామక కాలాన్ని పూర్తి చేసుకున్న అగ్నివీర్‌ల్లో 25 శాతం మందిని రెగ్యులర్ సైనికులుగా చేర్చుకుంటామన్నారు. మిగిలిన 75 శాతానికి సంబంధించి రెండేళ్ల రెండవ నియామక కాలాన్ని మంజూరు చేయాలని భారత రక్షణ దళాలు సిఫార్సు చేయగా, క్యాబినెట్ ఈ రోజు దానికి ఆమోదం తెలిపిందని తెలిపారు.



వసతులు లేక విద్యార్థుల ఇబ్బందులు

అక్షరటుడే, రంగారెడ్డి : రాష్ట్రంలో విద్యార్థులు వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. నిరసన తెలుపుతున్న మహేశ్వరం మెడికల్ కాలేజీ విద్యార్థులను ఆయన కలిశారు. వారి సమస్యల గురించి ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. కాలేజ్ బిల్డింగ్‌కు వాటర్ బిల్లు, కరెంటు బిల్లు కూడా కట్టడం తెల్వదా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'నీ అంత చెత్త ముఖ్యమంత్రి ఈ రాష్ట్రానికి రాలేదు, వచ్చినందుకు ప్రజలు కష్టపడుతున్నారు' అని వ్యాఖ్యానించారు.



పార్టీలో క్రమశిక్షణా రాహిత్యంపై పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ సీరియస్ అయ్యారు. వివిధ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నాయకుల మధ్య పెరుగుతున్న క్రమశిక్షణా రాహిత్యం, విభేదాల అంశాన్ని తీవ్రంగా పరిగణనలోకి తీసుకున్నారు. ముఖ్యంగా ఢిల్లీలో మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు మధ్య జరిగిన వ్యవహారంపై తీవ్రంగా పరిగణించారు. ఇద్దరు నేతలను రేపు గాంధీ భవన్‌కు రావాలని సూచించారు.

- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

'ఢిల్లీ పంచాయితీ'పై పీసీసీ సీరియస్

- మంత్రి, ఎమ్మెల్యే ఎపిసోడ్‌పై మహేశ్‌కుమార్ గౌడ్ ఆగ్రహం
- రేపు గాంధీ భవన్‌కు రావాలని సూచన
- నేతలతో చర్చించిన అనంతరం చర్యలు

ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావుల మధ్య నెలకొన్న వివాదానికి సంబంధించిన అంశంపై చర్చించేందుకు గురువారం గాంధీ భవన్‌లో జరిగే సమావేశానికి హాజరు కావాలని టీపీసీసీ చీఫ్ వారిద్దరినీ ఆదేశించారు. ఇతర నియోజకవర్గాల్లో ఇటీవల చోటుచేసుకున్న క్రమశిక్షణా రాహిత్య ఘటనలను కూడా పార్టీ పరిశీలించి, విచారణ చేపట్టనుంది.

ఎమ్మెల్యే ఫిర్యాదుతో..

ఢిల్లీలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో నవంబర్ 1న ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి రాష్ట్రం నుంచి మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులు వెళ్లారు. ఈ క్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావుపై వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. తనను తీవ్ర పదజాలంతో దూషించారని ఎమ్మెల్యే పార్టీకి ఫిర్యాదు చేశారు.

చర్యలు తీసుకుంటారా..

ఈ క్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ గురువారం ఇద్దరు నేతలను గాంధీ భవన్‌కు రావాలని సూచించారు. వారితో ఆయన చర్చించనున్నారు. ఇటీవల సీఎంపై కొండా సురేఖ కూతురు అనుచిత వ్యాఖ్యలు చేయడంతో ఆమెను మంత్రి పదవి నుంచి తొలగించారు. తాజాగా ఓ ఎమ్మెల్యేలపై అందరి ముందు మంత్రి నోరు పారేసుకోవడంతో.. ఆయనపై పార్టీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందోననే ఉత్కంఠ నెలకొంది.

రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు



అక్షరటుడే, హైదరాబాద్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి భూములు అమ్మే బ్రోకర్ అన్నారు. అదువులను నరికే వీరప్పన్‌ను అటవీ శాఖ మంత్రి చేస్తే ఎలా ఉంటుందో.. భూములు అమ్మే రేవంత్ రెడ్డిని సీఎం చేస్తే అలా ఉందన్నారు. హైదరాబాద్ నగరానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ భవన్‌లో వారికి కండువాలు కప్పి కేటీఆర్ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఏడాదిలోపు మళ్లీ కేసీఆర్ సీఎం అవుతారన్నారు. రేవంత్ రెడ్డి వేసే ఎంగిలి మెతుకులకు ఎవరైనా పారిశ్రామికవేత్తలు ఆశపడి హిల్ట్ పాలసీ స్కాంలో భూములు కొంటే తిరిగి అనుభవిస్తారని హెచ్చరించారు. తమ ప్రభుత్వం వచ్చాక.. ఇప్పుడు జరుగుతున్న భూదందాలన్నింటికీ చెక్ పెడతామన్నారు.

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ట్రంప్‌కు షాక్



అక్షరటుడే, నేషనల్ డెస్క్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు అక్కడి ఓటర్లు షాక్ ఇచ్చారు. మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్స్‌ను గెలిపించారు. డెమోక్రాట్లు మెజారిటీ స్థానాల్లో విజయం సాధించారు. టెక్సాస్, కాన్సాస్, ఓహియోలో వారి హవా కొనసాగింది. కొన్నేళ్లుగా రిపబ్లికన్ల కంచుకోటగా ఉన్న సౌత్ కరోలినా సెనేట్‌ను సైతం కైవసం చేసుకున్నారు. టెక్సాస్ సెనేట్‌లో 32 ఏళ్ల తర్వాత డెమోక్రాట్స్ విజయం సాధించడం గమనార్హం. సెనేట్‌లో మ్యాజిక్ ఫిగర్‌ను డెమోక్రాట్స్ అధిగమించారు. దీంతో ట్రంప్ పదవీకాలం ముగిసేంత వరకు డెమోక్రాట్స్ చేతిలోనే సెనేట్, కాంగ్రెస్ ఉండనున్నాయి.

యూట్యూబ్ వీడియోలు చూసి నకిలీ నోట్ల తయారీ

అక్షరటుడే, హైదరాబాద్ : ఓ వ్యక్తి యూట్యూబ్‌లో వీడియోలు చూసి నకిలీ కరెన్సీ నోట్లు తయారు చేయడం నేర్చుకున్నాడు. అతడిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి రూ.6.78 కోట్ల నకిలీ నోట్లు స్వాధీనం చేసుకున్నారు. కుంట్లూరు కేంద్రంగా నడుస్తున్న నకిలీ కరెన్సీ రాకెట్‌ను పోలీసులు ఛేదించారు. పోలీసులు రామోజీ ఫిల్మ్ సిటీ సమీపంలో ఓ కారును ఆపారు. అందులో తనిఖీ చేయగా.. రూ.8 లక్షల నకిలీ కరెన్సీ నోట్లు ఉన్నాయి. వారిని విచారించగా.. కుంట్లూరు కేంద్రంగా నడుస్తున్న దందా విషయం తెలిసింది. అక్కడ తనిఖీ చేయగా.. రూ.6.70 కోట్ల విలువైన ఫేక్ కరెన్సీ నోట్లు లభించాయి.



చికిత్స పొందుతూ మహిళా కండక్టర్ మృతి



అక్షరటుడే, ఖమ్మం : ప్రయాణికురాలు నెట్టేయడంతో బస్సులో నుంచి కిందపడ్డ మహిళా కండక్టర్ చికిత్స పొందుతూ మృతి చెందింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు డిపోకు చెందిన కండక్టర్ గుండ్ల ప్రవళికను అక్టోబర్ 25న ఓ ప్రయాణికురాలు కదులుతున్న బస్సులో నుంచి తోసేసింది. ఆమె మంగళవారం రాత్రి చనిపోయింది. ప్రవళిక మృతిపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వం, ఆర్టీసీ బాధిత కుటుంబానికి అండగా ఉంటాయని హామీ ఇచ్చారు.

వెంటిలేటర్లు ఎత్తుకెళ్లిన దొంగలు



అక్షరటుడే, ఆదిలాబాద్ : ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రి నుంచి నాలుగు వెంటిలేటర్లు చోరీకి గురయ్యాయి. అక్టోబర్ 30న ఆర్ఐసీయు ఛాతీ వార్డు నుంచి రెండు, టీబీ వార్డు నుంచి మరో రెండు వెంటిలేటర్లను ఎత్తుకెళ్లారు. సీసీ ఫుటేజీ పరిశీలించగా.. ఇద్దరు వ్యక్తులు వెంటిలేటర్లను తీసుకు వెళ్తున్నట్లు కనిపించింది. ఆస్పత్రిలో అందరు ఉండగానే వెంటిలేటర్లు చోరీకి గురవడంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు డ్యూటీ డాక్టర్లు, భద్రతా సిబ్బందితో సహా 10 మంది సిబ్బందికి మెమోలు జారీ చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల బలోపేతం : కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్



అక్షరటుడే, ఢిల్లీ: పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలు, అత్యాచార కేసులను పరిష్కరించేందుకు 850 ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను బలోపేతం చేయడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. మహిళలపై జరుగుతున్న అకృత్యాలు, భావి తరాల భద్రతకు ముప్పు కలిగించే సమస్యలు ఎదురైనప్పుడు, కఠినమైన చర్యలు తీసుకోవాలనేది తమ ప్రభుత్వ సంకల్పం అన్నారు.

సివిల్ వివాదాల్లో పోలీసుల జోక్యంపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు

అక్షరటుడే, కర్ణాటక: సివిల్ వివాదాల్లో పోలీసుల జోక్యంపై కర్ణాటక హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రైవేట్ పార్టీల మధ్య పౌర వివాదాలలో పోలీసు సిబ్బంది జోక్యం చేసుకుంటున్నారనే ఆరోపణలతో పాటు ఇతర అంశాలను పరిశీలించడానికి ప్రజా ప్రయోజన వ్యాజ్యం నమోదు చేయాలని ఆదేశించింది. పౌర హక్కులను నిర్ణయించడానికి, పౌర వివాదాలను పరిష్కరించడానికి పోలీస్ స్టేషన్లను వేదికలుగా ఉపయోగించొద్దని జస్టిస్ డి.కె. సింగ్, జస్టిస్ హెచ్. శాంత భూషణ్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. పోలీసులు తమ అధికార పరిధిలోనే పని చేయాలని సూచించింది.

